సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం। 26। మార్చి। 2024



టన్ను చీనీ రూ.25 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25 వేలు పలికాయి. మార్కెట్‌కు 518 టన్నుల సరుకు వచ్చింది.



కిలో టమాట రూ.12
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.05



న్యూస్‌రీల్

కదిరిలో ఇఫ్తార్‌ విందుకు సీఎం జగన్



సీఎం పర్యటనపై మక్బూల్‌తో చర్చిస్తున్న తలశిల రఘురాం

కదిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి త్వరలో కదిరికి రానున్నారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనార్టీల కోసం ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందులో సీఎం జగన్ పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన వేదికను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం సోమవారం కదిరికి విచ్చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్‌తో కలిసి కదిరి–మదనపల్లి రోడ్‌లోని పీవీఆర్ ఫంక్షన్ హాలును పరిశీలించారు. [illegible] మన్నారు. [illegible] తెలిపారు.

ప్రశాంతి నిలయంలో హోలీ సందడి



ప్రేమ్ భక్తి పర్వ్ నాటికలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రశాంతి నిలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. [illegible] దర్శించుకున్నారు.

అతివకు ఆర్థిక చేయూత



ఈ చిత్రంలోని మహిళ పేరు గంగమ్మ. రొళ్ల మండలం టీడీ పల్లి గ్రామం. శారద స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. రూ.1.50 లక్షలు బ్యాంక్ లింకేజ్ రుణం తీసుకుని ఇంటి నిర్మాణానికి, పంటలసాగుకు పెట్టుబడి పెట్టింది. పంట దిగుబడులు బాగా రావడంతో రుణాన్ని ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవ తీసుకుని తక్కువ వడ్డీకే బ్యాంక్‌లో రుణం ఇప్పించడంతో వడ్డీ బాధలు తప్పాయని, ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నానని గంగమ్మ ఆనందంగా చెబుతోంది.

మహిళా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించేలా దేశంలోనే ఎక్కడా లేని విధంగా వినూత్న పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్వయం సహాయక సంఘాల్లోని (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే భారీగా రుణాలు మంజూరు చేయిస్తున్నారు. ఫలితంగా మహిళలు వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు వివిధ వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.



- స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు
- జీవనోపాధులు పెంచుకుని కుటుంబాలకు ఆసరా

మడకశిర: మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. వివిధ పథకాలతో ఆర్థిక అభివృద్ధికి చేయూతనిస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ హయాంలో ఉనికి కోల్పోయిన స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు ఊపిరి పోశారు. అలాగే సంఘాల్లోని సభ్యుల జీవనోపాధులను పెంచడానికి వీలుగా తక్కువ వడ్డీకే వివిధ బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు.

రికార్డు స్థాయిలో రుణాలు మంజూరు..

జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు జగన్ సర్కార్ రికార్డు స్థాయిలో బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయించింది. గత ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతంలోని 24,739 మంది మహిళలు రూ.4,101.97 కోట్లు,



మహిళా సంఘాల సభ్యులు

పట్టణ ప్రాంతంలో 35,900 మంది మహిళా సంఘాల సభ్యులు రూ.1,200.23 కోట్ల మేర లబ్ధి పొందారు. రుణంగా పొందిన మొత్తాన్ని కొందరు వ్యాపారంలో పెట్టుబడి పెట్టగా, మరికొందరు పంటలకు పెట్టుబడి కోసం వినియోగించారు. ఆర్థికంగా ఎదుగుతూ క్రమం తప్పకుండా బ్యాంకులకు కంతులు చెల్లిస్తున్నారు. అధిక వడ్డీ బాధలు తప్పడంతో కుటుంబాలకూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.

మహిళా సంఘాల సభ్యులకు రుణ మంజూరు ఇలా...

ఆర్థిక సంవత్సరం	గ్రామీణ ప్రాంత మహిళలకు రుణాలు (రూ.కోట్లలో)	పట్టణ ప్రాంత మహిళలకు రుణాలు (రూ.కోట్లలో)
2019-20	750. 89	130.40
2020-21	674.40	126.76
2021-22	657.63	245.35
2022-23	953.99	331.31
2023-24	1,065.06	366.41

రూ.4,101.97 కోట్లు
ఐదేళ్లలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు అందించిన రుణం

24,739
రుణాలు పొందిన గ్రామీణ ప్రాంత మహిళల సంఖ్య

రూ.1,200.23 కోట్లు
ఐదేళ్లలో జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు అందించిన రుణం

35,900
రుణాలు పొందిన పట్టణ ప్రాంత మహిళల సంఖ్య

ఆర్థికంగా ఎదిగా



నేను కొన్నేళ్లుగా మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. గతంలో మాకు ఏ బ్యాంకు కూడా రుణం మంజూరు చేసేది కాదు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక బ్యాంకు వాళ్లే పిలిచి మరీ స్త్రీనిధి కింద రూ.5 లక్షలు రుణం ఇచ్చారు. దీంతో నా కుటుంబ అవసరాలన్నీ తీరాయి. ఆర్థికంగా ఎదిగాను. తక్కువ వడ్డీకావడంతో బ్యాంకుకు క్రమం తప్పకుండా కంతులు చెల్లిస్తున్నా. సీఎం వైఎస్ జగన్ మహిళల ఆర్థికాభివృద్ధిపై చొరవ చూపడంతోనే ఇది సాధ్యమైంది.

– లక్ష్మమ్మ, కనుమర గ్రామం, రొద్దం మండలం

మహిళా పక్షపాతి వైఎస్ జగన్



నేను మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. నాకు బ్యాంకు ద్వారా రూ.8 లక్షల రుణం మంజూరైంది. ఈ మొత్తాన్ని నా కుటుంబ అవసరాలకు వినియోగించుకున్నా. ఆర్థిక ఇబ్బందుల నుంచి ఊరట లభించింది. అధిక వడ్డీల భారం తగ్గడంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటూ ప్రతినెలా క్రమం తప్పకుండా కంతులు చెల్లిస్తున్నా. మహిళల సంక్షేమం పట్ల ఇంతలా చొరవ తీసుకుంటున్న ప్రభుత్వం ఇదే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళల పక్షపాతి. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–మమత, ఫళారం, గుడిబండ మండలం

రికార్డు స్థాయిలో రుణాల మంజూరు



గత ఐదేళ్లలో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రికార్డు స్థాయిలో బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయించాం. ప్రభుత్వ చొరవతోనే ఇది సాధ్యమైంది. వైకేపీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో కష్టపడటంతో లక్ష్యం మేరకు రుణాలు ఇప్పించగలిగాం. ఆర్థిక క్రమశిక్షణ కలిగిన సంఘాలకు బ్యాంకులు కూడా శ్రద్ధ తీసుకుని రుణాలు మంజూరు చేశాయి. బ్యాంక్ లింకేజీ రుణాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి అవకాశం ఏర్పడింది.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

ఫ్యాన్ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు

- జిల్లాలోని అన్ని స్థానాల్లో జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈర లక్కప్ప

మడకశిర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు జనమంతా మద్దతుగా నిలుస్తున్నారని, ప్రజాభిమానంతో రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ అన్నారు. సోమవారం ఆయన వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, పార్టీ ఎన్నికల పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఫ్యాన్ ప్రభంజనం ముందు నిలువలేవన్నారు. తప్పకుండా జిల్లాలోని ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడం తథ్యమన్నారు. మోసానికి, వెన్నుపోటుకు నిదర్శనమైన చంద్రబాబు మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆపార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా కష్టమేనన్నారు. వైఎస్ జగన్ హామీలన్నీ నెరవేర్చారని, సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలిచారన్నారు. అందువల్లే జనమంతా ఇప్పుడు వైఎస్సార్ సీపీ వెంట నడుస్తున్నారన్నారు.

అయ్యో 'పాప'ం



రాయదుర్గంటౌన్: పుట్టి నాలుగైదు రోజులు గడిచిన ఓ పసికందును రోడ్డుపై పడేసిన ఉదంతం రాయదుర్గం పట్టణంలో సోమవారం సాయంత్రం వెలుగుచూసింది. పట్టణంలోని లక్ష్మీబజార్‌లోని ప్రధాన రహదారి పక్కన గల ముదుగులమ్మ గుడి వద్ద పసికందు ఏడుస్తూ ఉండడాన్ని అటు వైపు వెళ్లిన శాంతి అనే మహిళ గుర్తించారు. వెంటనే పాపను అక్కడికి సమీపంలో ఉన్న స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి అప్పగించారు. వైద్యాధికారి మాధవి బిడ్డకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. సమాచారాన్ని ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతపురంలోని శిశు సంక్షేమ గృహానికి పసికందును తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.

నమో నారసింహ..

- వైభవంగా కనుమ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ 'పురం' అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు దీపిక, శాంతమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్



బ్రహ్మ రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

చిలమత్తూరు: కనుమలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి బ్రహ్మ రథోత్సవం కమనీయంగా సాగింది. ఉదయం ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నారసింహుడిని ఆలయం నుంచి రథం వరకూ పల్లకీలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం రథంలో కొలువుదీర్చి రథోత్సవం ప్రారంభించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజనులు నమో నారసింహా అంటూ కీర్తించగా, చిలమత్తూరు మార్మోగింది. భక్తులు దవనం, మిరియాలు, అరటిపళ్లు రథం పైకి చల్లి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం దిగువ బస్టాండ్ వరకూ సాగింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేమన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. రాత్రి నిర్వహించిన ధూళోత్సవం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపిక, పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ, పార్టీ నేతలు చౌళూరు మధుమతిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ఉత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి రథాన్ని లాగారు.

రథోత్సవంలో టీడీపీ నేతల బరితెగింపు

కనుమ లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మ రథోత్సవంలో టీడీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. పవిత్రమైన ఆలయంలో జై బాలయ్య నినాదాలు చేశారు. తొలుత టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి వెళ్లి స్వామి దర్శనానికి వెళ్లారు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అప్పటికే అక్కడ వేచి ఉన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తలు దీపిక, శాంతమ్మ తదితరులు ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నేతలు ఆ తర్వాత అలజడి సృష్టించారు. స్వామి వారిని పల్లకీలో రథం వద్దకు తీసుకువెళ్లే సమయంలో, పల్లకీ ఎత్తుకొనే సమయంలో బీకేతో పాటుగా టీడీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించి వైఎస్సార్ సీపీ నేతలను పక్కకు నెట్టివేశారు. అంతేకాకుండా 'జై బాలయ్య' అంటూ నినాదాలు చేశారు. దైవ కార్యంలో రాజకీయాలేమిటని అక్కడున్న చిలమత్తూరు గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ ఆగ్రహం వ్యక్తం చేయగా... వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ వారికి సర్దిచెప్పారు. బీకే పార్థసారథి ఎక్కడికి వెళ్లినా ఇలా ఏదో ఒక గొడవ పెడుతుంటారని స్థానికులు మండిపడుతున్నారు.

కుటాలపల్లిలో రైతు దారుణ హత్య

- రాత్రి పొలం వద్ద దారుణంగా నరికి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు
- సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలించిన ఎస్పీ మాధవరెడ్డి
- పోలీసు జాగిలాలతో హంతకుల ఆచూకీ కోసం గాలింపు



అమర్నాథరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



మృతుని కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట



అమర్నాథరెడ్డి (ఫైల్)

నల్లమాడ: మండలంలోని కుటాలపల్లికి చెందిన రైతు దుద్దుకుంట అమర్నాథరెడ్డి(44) దారుణ హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి పొలం వద్దకు వెళ్లిన ఆయన్ను గుర్తు తెలియని వ్యక్తులు తల, ముఖం, మెడపై దారుణంగా నరికి చంపారు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...అమర్నాథరెడ్డి, సుధమ్మ దంపతులు. వీరికి స్వాతి, లిఖిత్‌కుమార్‌రెడ్డి సంతానం. అమర్నాథరెడ్డి వ్యవసాయంతో పాటు పాడిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామానికి కిలో మీటరు దూరంలోని పొలంలో షెడ్డు నిర్మించుకొని అక్కడే ఆవులు, గేదెలను కట్టేసేవారు. రోజూ రాత్రివేళ అమర్నాథరెడ్డి పశువుల వద్దకు కాపలాగా వెళ్లి అక్కడే పడుకొని ఉదయాన్నే ఆవు పాలు పిండుకొని ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లాడు. సోమవారం ఉదయం 6 గంటలైనా భర్త ఇంటికి రాకపోవడంతో భార్య సుధమ్మ అతని సెల్‌కు ఫోన్ చేసింది. రింగవుతున్నా తీయకపోవడంతో ఆందోళన చెందిన ఆమె.. అదే గ్రామంలో ఉండే తన అక్క కుమారుడు శ్యాంసుందర్‌రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితి వివరించింది. దీంతో అతను పొలం వద్దకు వెళ్తుండగా... సమీపంలోని మామిడి తోటలో తన చిన్నాన్న అమర్నాథరెడ్డి రక్తపుమడుగులో పడి ఉండటాన్ని గమనించి ఫోన్ ద్వారా కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అమర్నాథరెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. తల, మెడ, ముఖంపై పదునైన ఆయుధాలతో విచక్షణారహితంగా నరకడంతో లోతైన రక్తగాయాలై అమర్నాథరెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. ముఖం కూడా ఛిద్రం కావడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోటను అమర్నాథరెడ్డి లీజుకు తీసుకున్నట్లు తెలిసింది.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

రైతు అమర్నాథరెడ్డి హత్య సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి సోమవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. హంతకుల ఆచూకీ కోసం పోలీసు జాగిలాలను సైతం రంగంలోకి దింపారు. వీలైనంత త్వరగా హంతకులను గుర్తించి అరెస్ట్ చేయాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. మృతదేహాన్ని కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించగా, సోమవారం సాయంత్రం స్వగ్రామం కుటాలపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. హతుడు అమర్నాథరెడ్డి భార్య మాట్లాడుతూ.. తమకు గ్రామంలో ఎవరితోనూ ఎలాంటి విభేదాలు, ఆర్థిక, భూ తగాదాలు లేవని, తన భర్తను హత్య చేసిన వారిని గుర్తించి న్యాయం చేయాలని వేడుకుంది. ఈమేరకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేశారు. కాగా అమర్నాథరెడ్డి కేసులో నిందితులను నల్లమాడ పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే దుద్దుకుంట పరామర్శ..

రైతు అమర్నాథరెడ్డి హత్యకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి అమర్నాథరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని తండ్రి కేశవరెడ్డి, భార్య సుధమ్మ, కుమార్తె స్వాతి, కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అన్నివిధాలా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రహాసరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులున్నారు.

శేషవాహనంపై ప్రహ్లాద వరదుడు



శేషవాహనంపై లక్ష్మీ నారసింహుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు స్వర్ణ, వజ్ర, వైఢూర్య, మరకత, పట్టు పీతాంబరాల విశేషాలంకరణలో ఉన్న ఖాద్రీశుడు రాత్రి 9 గంటల ప్రాంతంలో శేషవాహనంపై కొలువుదీరారు. తర్వాత ఆలయం ముందు విద్యుత్ దీపాలంకరణ పూర్తి కాగానే తిరువీధుల్లో ఊరేగారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని భక్తులు దర్శించుకొని తన్మయత్వం చెందారు. లక్ష్మీ నారసింహునికి సేవ చేయడానికి సాక్షాత్తూ ఆదిశేషుడే వాహనంగా విచ్చేశారని అర్చక పండితులు వివరించారు. కదిరి పౌర్ణమి కావడంతో రోజంతా ఆలయంలో భక్తుల రద్దీ తగ్గలేదు. శేష వాహన ఉభయదారులుగా యాదాలం శ్రీనివాసులు, బాలాజీ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా నారసింహుడు మంగళవారం పగలు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.



స్వామి దర్శనం కోసం ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

క్లుప్తంగా

శ్రీవారి పాదాలు తాకిన సూర్యకిరణాలు



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ పాదాలను తాకిన సూర్యకిరణాలు

గుత్తి: స్థానిక కోటలో వెలసిన పురాతన లక్ష్మీనరసింహ ఆలయంలో మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఏటా ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు ఈ అద్భుతం చోటు చేసుకుంటోంది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున సూర్యకిరణాలు నేరుగా స్వామి పాదాలను తాకాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



వేపకుంటలో స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

కనగానపల్లి: మండలంలోని వేపకుంట వద్ద 11 కేసుల కర్ణాటక మద్యం తరలిస్తూ నిందితులు పట్టుబడ్డారు. వివరాలను కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. అందిన సమాచారం మేరకు సోమవారం వేపకుంటలోని ఎస్సీ కాలనీలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. గుజ్జల బ్రహ్మయ్య ఇంటి వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి ఇంట్లో దాచిన 11 కేసుల్లోని 1,056 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుంది. పట్టుబడిన మద్యం ప్యాకెట్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి రామగిరి సీఐ శివాంజనేయులు సమక్షంలో సీజ్ చేశారు. బ్రహ్మయ్యను అరెస్ట్ చేశారు.

రాప్తాడులో పట్టుబడిన పేరూరు వాసులు

రాప్తాడు: అనంతపురం జిల్లాలోకి అక్రమంగా 13 బాక్సుల కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ సోమవారం ఉదయం రాప్తాడు పోలీసులకు రామగిరి మండలం పేరూరు గ్రామానికి రాకేష్, గుడసాల మనోహర్, జి.మహేష్ పట్టుబడ్డారు. సోమవారం ఉదయం కర్ణాటక నుంచి బొలెరో వాహనంలో 13 బాక్సుల్లో 1,248 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని తీసుకుని రాప్తాడు మండలం పాలచెర్లలో విక్రయించేందుకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ బీవీ శివారెడ్డి, సీఐ మునిస్వామి నేతృత్వంలో బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టి బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రూ.87,360 విలువ చేసే కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. రాకేష్, మనోహర్, మహేష్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.

ఆర్మీ మద్యం బాటిళ్లు స్వాధీనం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఆర్మీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన బత్తల శ్రీనివాసులు ఇంట్లో 12 ఆర్మీ మద్యం బాటిళ్లు దాచి ఉంచాడు. అందిన పక్కా సమాచారంతో సోమవారం తనిఖీలు చేపట్టి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. తనిఖీల్లో సెబ్ ఎస్‌ఐ రాజన్న, కానిస్టేబుళ్లు గిరీష్ కుమార్, మల్లికార్జున, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు!

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త పద్ధతిని అమల్లోకి తెచ్చింది. వయోవృద్ధుల్ని , దివ్యాంగులను గౌరవిస్తూ ఇంటినుంచే ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పించింది. ఇటీవల ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా ఓట్ ఫ్రమ్ హోం విధానాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అసలు ఇంటి నుంచి ఎలా ఓటు వేయాలి? ఇంటి నుంచి ఓటు వేసేందుకు అర్హత ఏమిటి? ఎలా దరఖాస్తు చేసుకోవాలి? అనే అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



- పోలింగ్ శాతం పెరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు
- ఓట్ ఫ్రమ్ హోం విధానం అమలుకు శ్రీకారం
- 85 ఏళ్లు నిండిన వారు, దివ్యాంగులకు అవకాశం

హిందూపురం అర్బన్: ఓటు వేయాలని ఉన్నా వయోభారంతో ఇల్లు కదల్లేని వారికి, దివ్యాంగులకు కేంద్ర ఎన్నికల కమిషన్ సువర్ణ అవకాశాన్ని కల్పించింది. ఇంటి వద్ద నుంచే వీరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంది. ఈ సార్వత్రిక ఎన్నికల నుంచే ఓట్ ఫ్రమ్ హోం పద్ధతిని అందుబాటులోకి తీసుకురావడంతో ఈ సారి ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది.

ఎవరు అర్హులంటే..

మొత్తం 7 దశల్లో లోక్‌సభతో పాటు 4 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఓట్ ఫ్రమ్ హోం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు అర్హతలు, ఇతర నిబంధనలు, మార్గదర్శకాలను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యమున్న దివ్యాంగ ఓటర్లను అర్హులుగా ప్రకటించింది. వీరికి పోస్టల్ బ్యాలెట్లను మంజూరు చేయనున్నారు. దివ్యాంగులు తప్పనిసరిగా సదరమ్ సర్టిఫికెట్‌ను చూపాల్సి ఉంటుంది. నామినేషన్ల పర్వానికి ముందే అర్హుల ఇంటి వద్దకు అధికారులు వచ్చి దరఖాస్తులను అందజేస్తారు. వీటిని భర్తీ చేసి ఐదు రోజుల్లోపు బీఎల్‌ఓలకు అందజేయాలి. అనంతరం బూత్ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో దరఖాస్తుదారి ఇంటికి వెళ్లి పరిశీలిస్తారు. వారు ఓట్ ఫ్రమ్ హోం వేసుందుకు అర్హులే అనే విషయాన్ని నిర్ధారిస్తారు. ఆ తర్వాత అర్హులు సమర్పించిన ఫారం 12డీని రిటర్నింగ్ అధికారికి అందిస్తారు. ఓట్ ఫ్రమ్ హోం కోసం దరఖాస్తు చేసుకున్నవారి పూర్తి అడ్రస్, ఫోన్ నంబర్ను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

ఒక్క రోజు ముందే ఓటు వినియోగం..

ఇంటి వద్దనే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుంది. ఫారం–12డి ద్వారా దరఖాస్తు చేసుకున్న ఓటరు ఇంటికి ఎన్నికల సిబ్బంది మొబైల్ వాహనంలో చేరుకుని ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన చోట ఓటరు రహస్యంగా తన ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఇద్దరు పోలింగ్ అధికారులు, పోలీసు అధికారితో పాటు ఓ వీడియో గ్రాఫర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఓటరు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ప్రక్రియనంతా వీడియోగ్రఫీ చేయనున్నారు. ఈ ప్రక్రియను ఎన్నికలకు ఒకరోజు ముందుగానే పూర్తి చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఇది లెక్క..

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 13,91.628 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 10,300 మంది దివ్యాంగులు, 9వేల మందికి పైగా 85 ఏళ్లపై బడిన వారు ఉన్నారు. అలాగే అనంతపురం జిల్లా పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 19,98,841 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 9,99,463 మంది, మహిళ ఓటర్లు 10,10,137 మంది, ఎన్ఆర్ఐ ఓటర్లు 121 మంది, దివ్యాంగ ఓటర్లు 25,993 మంది, 85 ఏళ్లు పైబడి వయసున్న ఓటర్లు 9,799 మంది ఉన్నారు. వీరిలో అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే ఓట్ ఫ్రమ్ హోం సౌకర్యాన్ని కల్పించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

కనుల పండువగా శ్రీవారి రథోత్సవం



లక్ష్మీనరసింహస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష పూజలు, అలంకరణలు జరిగాయి. అనంతరం రథం ఎదుట శాంతి, నవగ్రహ హోమం, యోగీశ్వరారధన, గణపతి పూజ, బలిహరణ తదితర పూజలు చేశారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఆంజనేయస్వామి ఆలయం వరకూ ఊరేగించి, రథంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య లాగారు. కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా హనుమంతపురం గ్రామ నివాసి దివంగత ఈడిక కరియన్న కుటుంబ సభ్యుల దాతల సహకారంతో మూడు చోట్ల అన్నదానం చేశారు.

పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి..

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, సంయుక్త కార్యదర్శి రంగేగౌడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, జేసీఎస్ తాలూకా అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగేంద్ర, రొళ్ల, గుడిబండ మండలాల పార్టీ కన్వీనర్లు నరసింహారెడ్డి, డీఎల్ యంజారేగౌడు, మాజీ కన్వీనర్ శివప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, నాయకులు శ్రీరామప్ప, రంగప్పరాజు ప్రసన్నకుమార్, నగేష్‌రంగారెడ్డి, నాగేంద్ర, నగేష్, ఆనంద్, నరేష్ తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు దివ్యజ్యోతి దర్శనం..

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రొళ్లకొండపై భాగాన వెలసిన ఉగ్రనరసింహస్వామి ఆలయంలో దివ్యజ్యోతి దర్శనం ఉంటుంది. అనంతరం వసంతోత్సవం, ధాన్యం సేకరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, తదితరులు

టీడీపీ నాయకుడిపై రైతుల తిరుగుబాటు

పెనుకొండ: స్థానిక మున్సిపల్ పరిధిలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ దత్తారెడ్డిపై రైతులు తిరగబడ్డారు. వివరాలు.. ఎర్రమంచి రెవెన్యూ పరిధిలోని 68 సర్వే నెంబర్‌లో 31.40 ఎకరాల భూమిని చెరో ఓ భాగం చొప్పున రెండు భాగాలుగా దత్తారెడ్డి వంశీకులు, మున్సిపల్ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన జొన్నల బాబన్న కుటుంబీకులు కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 1997లో 9 ఎకరాలను అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ సమయంలో పరిహారం కింద అందజేసిన రూ. 7 లక్షల నగదును మాజీ సర్పంచ్ దత్తారెడ్డి తన అవసరాలకు వాడుకున్నాడు. అనంతరం రోడ్డుకు పోయిన 9 ఎకరాల భూమిని సైతం తనకు ఇవ్వాలని దత్తారెడ్డి దౌర్జన్యం చేయసాగాడు. దీంతో తమకు దక్కాల్సిన 31.40 ఎకరాల భూమిని తమకు అప్పగించాలని కొండాపురం రైతులు కోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ క్రమంలో రైతులు గత 2 రోజులుగా సదరు భూమిలో ముళ్ల పొదలను తొలగిస్తుండడంతో సోమవారం ఉదయం దత్తారెడ్డి, ఆయన అనుచరులు అడ్డుకున్నారు. దీంతో రైతులు తిరగబడ్డారు. ఒక దశలో ఒకరినొకరు కొట్టుకోవడానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు.



ఘర్షణ పడుతున్న రైతులు

మహిళకు గాయాలు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద సోమవారం ఉదయం బస్సు ఎక్కే సమయంలో తోపులాట చోటు చేసుకుని ఓ మహిళ చక్రం కిందపడి గాయపడింది. క్షతగాత్రురాలిని అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన ఉమాదేవిగా గుర్తించారు. పుంగనూరు డిపోకు చెందిన బస్సు బస్టాండులోకి చేరుకోగానే ప్రయాణికులు సీట్ల కోసం ఎగబడ్డారు. ఆ సమయంలో చోటు చేసుకున్న తోపులాటలో కిందపడిన ఉమాదేవి కాలుపై బస్సు చక్రం వెళ్లింది. దీంతో ఆమె కాలు విరిగింది. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మామపై దాడి.. అల్లుడికి జైలు

పుట్టపర్తి: మామపై దాడి చేసిన కేసులో అల్లుడికి జైలుకు శిక్ష విధిస్తూ పుట్టపర్తి న్యాయస్థానం తీర్పు వెలువరించింది. బుక్కపట్నం పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన శీను, వరలక్ష్మి దంపతులు. కుటుంబ కలహాల నేపథ్యంలో గత ఏడాది వరలక్ష్మి... అదే గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. గత డిసెంబర్ 28న మామ నారాయణ ఇంటికెళ్లి కుమార్తెను కాపురానికి పంపాలని శీను కోరాడు. దీనికి నిరాకరించిన మామపై దాడికి దిగాడు. దాడిని అడ్డుకోబోయిన తన భార్య వరలక్ష్మితో పాటు ఆమె తల్లి రాములమ్మనూ గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి, నిందితుడిని పుట్టపర్తి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో ఏడుగురు సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో శీనుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.



వీపులకు కొక్కీలు చెక్కించుకుని హైడ్రాలిక్ క్రేన్‌కు వేలాడుతున్న భక్తులు

ఘనంగా పంగుని ఉత్సవం



చెంపల్లో కొక్కీలు గుచ్చుకుని ఊరేగింపుగా తరలివస్తున్న భక్తులు



ఆలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దీపిక, శాంతమ్మ

హిందూపురం: తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తమిళనాడు నుంచి వలస వచ్చి స్థానికంగా స్థిరపడిన తమిళులు ఏటా ఫల్గుణ మాసంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని ఫణీనగర్, ఇందిరానగర్‌లో పంగుని ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

ఆకట్టుకున్న ఊరేగింపు..

సుబ్రహ్మణ్యస్వామి మాల ధరించి ఐదు రోజులుగా ఉపవాసదీక్షలు చేసిన తమిళులు ఇనుప చువ్వలు, సూదులు శరీరానికి గుచ్చుకుని భక్తిని చాటుకున్నారు. అలాగే మొక్కుబడుల్లో భాగంగా శరీరానికి కొక్కీలు తగిలించుకుని హైడ్రా జాకీలకు వేలాడుతూ ప్రదర్శనలిచ్చారు. ఖత సందర్భంగా 'హరోం... హర' అంటూ ఆ దేవదేవున్ని కీర్తించారు. మహిళలు, పురుషులు, పిల్లలు సైతం శరీరానికి కొక్కీలు గుచ్చుకుని స్వామి విగ్రహాలు, చిత్రపటాలతో ప్రత్యేకంగా తయారు చేసిన విల్లులను లాగుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. బెంగళూరు రోడ్డు నుంచి ప్రారంభమైన తమిళుల ఊరేగింపు చిన్నమార్కెట్, గాంధీసర్కిల్‌కు చేరుకుని తిరిగి అక్కడి నుంచి మెయిన్‌బజారు గుండా ఆలయం వరకూ చేరుకుంది. మాలధారులకు, తమిళ ప్రజలకు పట్టణ కూడళ్లలో దాతలు కూల్‌డ్రింగ్‌లు, తాగునీటి సదుపాయాలు కల్పించారు.

ఆలయంలో ప్రత్యేకపూజలు..


తమిళుల ఊరేగింపు సందర్భంగా హిందూపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపిక, పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బెంగళూరు రోడ్డులోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే దీక్షాధారుల ఊరేగింపులో పాల్గొని కొక్కిలు గుచ్చుకుని వెళ్తున్న భక్తులకు పానీయాలు అందించారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకులు, పురప్రముఖులు తరలివచ్చి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

నేత్రపర్వంగా లంకాదహనం



ప్రత్యేక అలంకరణలో కాటికోటేశ్వరుడు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం సమీపంలో వెలసిన కాటికోటేశ్వర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లంకాదహనం నేత్రపర్వంగా సాగింది. ఈదుల ముష్టూరు నుంచి తీసుకువచ్చిన స్వామి ప్రభను క్షేత్రంలో ఊరేగించారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. లంకాదహనం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్షేత్రం కిటకిటలాడింది. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు అన్ని చర్యలూ తీసుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. క్షేత్రంలోని మహంకాళీమాత ఆలయంలో గోపూజ నిర్వహించి, హిందు ధర్మ ప్రచారం గురించి వివరించారు. సంజీవపురం, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి, ముష్టూరు, వెంకటగారిపల్లి, అనంతసాగరం గ్రామాల నుంచి ఎద్దుల బండ్లపై వచ్చారు.



పూలతో అందంగా ముస్తాబైన ప్రభ